


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

ఆదివారం | 13 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 4


# భూ సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి శ్రీనివాస్ రెడ్డి



**బోనకల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** ఎటువంటి వివాదాలకు తావు లేకుండా భూ సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో జరుగుతున్న భూ సర్వే ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ భూ సర్వే సందర్భంగా ఆయన అధికారులకు, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూరి సర్వే నిర్వహిస్తుందని ఈ సర్వే ను మండల అధికారులు సిబ్బంది సమర్ధవంతంగా

మిగతా 2 లో...

- ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలి
- సిరిపురంలో జూనియర్ కాలేజ్ ఐటిఐ, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులపై అధికారులకు దిశానిర్దేశం
- మధిర జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసి, నియోజకవర్గం లోని వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



# గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ వైద్య సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్


**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత,వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని మధిర హాస్పిటల్లో అన్ని వైద్య సేవలు దొరుకుతాయనే విశ్వాసాన్ని నమ్మకాన్ని మధిర ప్రజలకే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గం ప్రజలకి కల్గించాలని అన్నారు.ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు

మిగతా 2 లో...

# కిరాణా, మార్ట్‌లలో 'డేట్' లేని విక్రయాలు




- వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటం!
- అధికారులు తక్షణమే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్యాక్ చేసిన బాటిళ్లు, కవర్లపై ఎక్స్‌పైరీ డేట్ స్పష్టంగా ఉంటున్నా, కిరాణా షాపులు,సూపర్ మార్కెట్లలో లూజుగా అమ్మే నిత్యావసర వస్తువులపై ఎలాంటి గడువు తేదీలు ఉండటం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నాణ్యత లేని, గడువు తీరిన సరుకులను లూజుగా విక్రయించడం వల్ల వినియో గదారులు పుడ్‌ప ాయిజన్, ఇతర తీవ్రమైన రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకవేళ ఈ కల్తీ,గడువు తీరిన లూజ్ సరుకులు తిని ప్రజలు అనారోగ్యం పాలైతే

మిగతా 2 లో...

# రాజీ మార్గమే రాజ మార్గం..

- రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు
- జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో

మిగతా 2 లో...

# కరెంట్ కోతలపై రైతన్న కన్నెర్ర

- సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



**వేంసూరు సెప్టెంబర్ 12 ప్రజాజ్యోతి** వ్యవసాయ విద్యుత్ కోతలపై రైతులు కన్నెర్ర చేశారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని కందుకూరులో విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన ర్యాలీ నిర్వహించి కందుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.కనీసం ఏడు గంటల విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో నీరందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.రైతుల ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...

## కరెంట్ కోతలపై రైతన్న కన్నెర్ర




(మొదటి పేజీ తరువాయి...)

ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ సవాల్‌గా తీసుకుని తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండగగా మార్చి రైతులకు భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రైతుల విద్యుత్ అవసరాలపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందుల్లోకి నెట్టకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు కోతలు లేని విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించారు. రైతులకు వాస్తవంగా ఎంతసేపు విద్యుత్ సరఫరా అందుతుందో, ఎంతసేపు అంతరాయం ఏర్పడుతుందో వివరాలను పరిశీలించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా తప్పించుకునే ధోరణిని విడనాడి తక్షణమే కోతలు లేని విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కందుకూరులో రైతులతో ప్రారంభమైన ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని, విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, కందుకూరు సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల ప్రభాకర్ రెడ్డి, భరణిపాడు బీఆర్ఎస్ నాయకులు మందపాటి మహేశ్వర రెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భూ సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించాలని సూచించారు. భూ రీ సర్వేలో కూడా తప్పులు, పొరపాటు, వివాదాలు, తలెత్తితే సంబంధిత అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రతి భూమిని రీ సర్వే నిర్వహించాలని సంబంధిత రైతుల అభిప్రాయాల ను తెలుసుకోవాలని వారిని ఏరకంగానూ ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఈ భూ సర్వే ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో హక్కు పట్టాలు లభిస్తాయన్నారు. ఈ సర్వే వలన రైతులకు భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తమన్నారు. మండల అధికారులు, సర్వేయర్ భూ సర్వే సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల తహసిల్దార్ చల్లూరి సుధాకర్, గిర్దవర్ 1 సామినేని నరసింహారావు, మండల సర్వేయర్ ధర్మసోద్ రవి, బోనకల్ జిపిఓ తిరుమల శెట్టి శ్రీనివాసరావు, గ్రామ రైతులు ఉన్నారు.

## కిరాణా, మార్ట్‌లలో 'డేట్' లేని విక్రయాలు

(మొదటి పేజీ తరువాయి...)

దానికి బాధ్యులు ఎవరు? కేవలం లాభాపేక్షతోనే వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, వినియోగదారుల హక్కులను కాలరాస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ప్రజా డిమాండ్లు:

తక్షణ తనిఖీలు: ఆహార భద్రతా అధికారులు వెంటనే స్పందించి, ప్రతీ కిరాణా షాపు, మార్ట్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.

లూజ్ విక్రయాలపై నియంత్రణ: లూజుగా అమ్మే పప్పు ధాన్యాలు, పిండి, నూనెలు, ఇతర దినుసుల ప్యాకింగ్, స్టాక్ రికార్డులను పక్కాగా తనిఖీ చేయాలి.

కఠిన చర్యలు: డేట్ వేయకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సరుకులు అమ్ముతున్న హోల్ సేల్ కిరాణా దుకాణాలు, మార్ట్ నిర్వాహకులపై భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

బోర్డుల ఏర్పాటు: ప్రతీ షాపులో లూజ్ సరుకుల వివరాలు, వాటి తయారీ, గడువు తేదీలను స్పష్టంగా తెలిపే బోర్డులను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి. ప్రజా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ లాభాలే పరమావధిగా వ్యవహరిస్తున్న మార్ట్ నిర్వాహకులపై అధికారులు దయదాక్షిణ్యాలు చూపకుండా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ వైద్య సేవలు అందించాలి






(మొదటి పేజీ తరువాయి...)

,విద్యుత్,పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర మెడిసిన్‌తో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రతి వైద్యుడు, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం..







(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ, వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరు పక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్ / ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

- **జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ఎస్ఈ**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించి జీరో యాక్సిడెంట లక్ష్యాన్ని సాధించే దిశగా సమగ్ర భద్రతా చర్యలు చేపడుతున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసచారి తెలిపారు.వినియోగదారుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్ వ్యవస్థలు, ఏబీ స్విచ్‌ల నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**జీరో యాక్సిడెంట్ లక్ష్య సాధనలో భాగంగా చేపట్టిన ప్రధాన చర్యలు:**

వదులుగా ఉన్న విద్యుత్ లైన్ల వద్ద మిడిల్ పోల్స్‌ను జనవరి నుంచి ఇప్పటివరకు 1946 నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది.వంగిపోయిన, తుప్పు పట్టిన, బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి,635 వంగిపోయిన స్తంభాలు సరిచేయుట మరియు 1415 నూతన స్తంభాలను ఏర్పాటు చేసి మార్చారు.పశువులు,రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు 53 ట్రాన్స్‌ఫార్మర్ గద్దెల ఎత్తును పెంచి భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచారు.పాతబడిన విద్యుత్ లైన్లను తొలగించి వాటి స్థానంలో 257 మీటర్ల మేర నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు.సరైన ఎర్తింగ్ లేని ప్రాంతాలను 1274 ప్రాంతాల్లో గుర్తించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఎర్తింగ్ వ్యవస్థను సరిచేశారు. ఫీడర్లలో ఇండక్షన్ ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను 271 చోట్ల గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యల ద్వారా సమస్యను పరిష్కరించారు.రెండు వైపుల నుంచి విద్యుత్ సరఫరా జరిగే ప్రాంతాల్లో డేంజర్ బోర్డులను ఏర్పాటు చేసి, మరమ్మతులు, నిర్వహణ పనుల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేసి లోకల్ లైన్ క్లియర్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీనివల్ల మరమ్మతుల సమయంలో నిర్దిష్ట ప్రాంతానికి మాత్రమే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, సిబ్బంది భద్రతతో పాటు వినియోగదారులకు కలిగే విద్యుత్ అంతరాయ సమయాన్ని గణనీయంగా తగ్గించే చర్యలు చేపట్టారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, ముందస్తు నివారణ చర్యలు, నిరంతర తనిఖీలు, సిబ్బందికి భద్రతా అవగాహన వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని ఎస్ఈ తెలిపారు. విద్యుత్ పరికరాలు, లైన్ల నిర్వహణలో ఎక్కడా రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలు విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని,తెగిపోయిన లేదా ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ వైర్లు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని ఎస్ఈ సూచించారు.వినియోగదారుల భద్రతే ప్రధాన ల క్ష్యంగా,విద్యుత్ ప్రమాదాలకు పూ ర్తిగా తావులేని సురక్షిత విద్యుత్ వ్యవస్థను నిర్మించేందుకు నిరంతరం చ ర్యలు కొనసాగిస్తామని ఎస్ఈ స్పష్టం చేశారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

- **అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క యువ సేన సహకారం**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో వి.వెంకటాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, భట్టి విక్రమార్క యువ సేన సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది.ఈ శిబిరంలో హైదరాబాద్ లకిడికపూల్ నుంచి వచ్చిన గ్లెనేగిల్స్ , ఫోర్టిస్ నెట్వర్క్ హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించింది.వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్యులు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. గుండె, మహిళల ఆరోగ్యం, కంటి, దంత, గ్యాస్ట్రో, శ్వాసకోశ తదితర విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.శిబిరాన్ని విజయవంతం చేసిన లకిడికపూల్ వైద్య బృందం,ఆసుపత్రుల సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏచూరి ఆశయాల సాధనే నిజమైన నివాళి



**కల్లూరు, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి** సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా వామపక్ష ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతిని పురస్కరించుకొని కల్లూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లౌకికవాదం సామాజిక న్యాయం సమానత్వం కోసం ఏచూరి జీవితాంతం పోరాడారని అన్నారు. కార్మికులు రైతులు మహిళలు యువత అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఏచూరి చూపిన మార్గంలో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మతోన్మాదం నిరుద్యోగం రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తన్నీరు కృష్ణార్జున రావు, ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, గంపల శ్రీనివాసరావు, తాళ్ల వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత మానవాళికి జ్ఞాన సంపద

- **కోటి మందికి గీత గ్రంధాల పంపిణీ.. కోటి భగవద్గీత మహా యజ్ఞం**



**కల్లూరు, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి** భగవద్గీత మానవాళికి లభించిన అత్యున్నత జ్ఞాన సంపద అనే జై హనుమాన్ సేవ ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ అన్నారు. భగవద్గీత లోని జీవన సత్యాలను ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే సంకల్పంతో తమ ట్రస్టు ఆధ్వర్యంలో కోటి భగవద్గీత మహా యజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కోటి మందికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రకృతిని శాసించాలనే అహంకార ధోరణితో మానవుడు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడని అన్నారు. సర్వ చరాచర జగత్ భగవంతుని ఆధీనంలోనే నడుస్తుందని భగవద్గీత బోధిస్తోందన్నారు. అహంకారం స్వార్థం చివరకు మానవుడు పతనానికి దారితీస్తాయని పేర్కొన్నారు. ప్రకృతిని శాసించాలని ప్రయత్నించిన మహా పర్వతానికే గర్వభంగం తప్ప లేదని జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తూ ప్రకృతితో చలగాటమాడుతున్న మానవుడు కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తుఫాన్లు వరదలు భూకంపాలు మహమ్మారుల రూపంలో ప్రకృతి మనిషికి హెచ్చరికలు ఇస్తోందని పేర్కొన్నారు. మానవాళి ప్రశాంతమైన జీవనం సాగించాలంటే అహంకారాన్ని వీడి వినయం జ్ఞానాన్ని అలవర్చుకోవాలని నరేష్ సూచించారు. నిష్కమకర్మ అహంకార రాహిత్యం పకృతి పట్ల గౌరవం వంటి విలువలను భగవద్గీత బోధిస్తోందన్నారు. భగవద్గీత కేవలం పవిత్ర గ్రంథమే కాకుండా ఆచరణీయమైన జీవన వికాస గ్రంథం అని పేర్కొన్నారు. ఈ జ్ఞాన సంపదను ప్రజలందరికీ చేరువ చేయడమే పోటీ భగవద్గీత మహా యజ్ఞం ప్రధాన ఉద్దేశం అని చెవుల నరేష్ తెలిపారు.

## వర్షం పడితే విద్యార్థులకు నరకం

- **పాఠశాల,అంగన్వాడీ కేంద్రం చెరువును తలపిస్తున్న వైనం**



**కారేపల్లి, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి:** వర్షం పడిందంటే పాఠశాల,అంగన్వాడీ కేంద్రం పరిసరాలు వర్షపు నీటితో నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగరేణి మండలకేంద్రం బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల,అంగన్వాడీ కేంద్రం వద్ద ఈ పరిస్థితి నెలకొంది.అంగన్వాడీ కేంద్రానికి ప్రతిరోజూ 15 మంది చిన్నారులు,నలుగురు గర్భిణీ స్త్రీలు వస్తుంటారు.అలాగే ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 18 మంది విద్యార్థులు చదువుతుండగా,ఇద్దరు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు.అయితేవర్షం కురిసిన ప్రతిసారీ పాఠశాల,అంగన్వాడీ కేంద్రం చుట్టూ నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం వర్షానికి ఇదే పరిస్థితి.ముఖ్యంగా చిన్నారులు వర్షపు నీటిలో నుంచి బయటకు రావడం,కనీస అవసరాల కోసం వెళ్లడం కూడా కష్టంగా మారుతోందని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రఘుపతి,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాళ్లు విజయలక్ష్మి ,అనూష తెలిపారు.పాఠశాల,అంగన్వాడీ కేంద్రం వద్ద నీరు నిలవకుండా అధికారులు వెంటనే పరిశీలించాలని వారు కోరుతున్నారు.లోతట్టు ప్రాంతాన్ని మట్టితో నింపి,వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు.

## ఖమ్మం జోన్ స్థాయి వాయిస్ ఆఫ్ గురు - 2026 పోటీలు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో ఖమ్మం జోన్ స్థాయిలో నిర్వహించిన "వాయిస్ ఆఫ్ గురు – 2026" (ద టీచర్ స్పీకింగ్ ఛాంపియన్షిప్ ) కార్యక్రమం ఘనంగా జరిగింది .ఉపాధ్యాయులలోని వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసి, ఆలోచనలను సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి .ఈ సందర్భంగా ఖమ్మం జోన్‌కు చెందిన వివిధ నారాయణ పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని విద్య,విలువలు ,నాయకత్వం ,విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తపరిచారు .పోటీలు అత్యంత ఆసక్తికరంగా సాగగా , ఉపాధ్యాయుల ప్రసంగ నైపుణ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి . జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందించి ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ,వ్యక్తిత్వ వికాసానికి దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నారాయణ విద్యాసంస్థల ఏ.జి.ఎం ఎస్.రాంకీ , ఆర్.ఐ క్రాంతి కుమార్ ,కోఆర్డినేటర్ వినోదలక్ష్మి ,పాఠశాల ప్రిన్సిపల్ జి.నవీన్ కుమార్ , లైఫ్ స్కిల్స్ ట్రైనర్ నరేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హెప్సీబా కు ఎమ్మెల్యే రాగమయి ఆశీర్వాదం



**సత్తుపల్లి సెప్టెంబర్12(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి ,వేంసూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు వారి కుమార్తె హెబ్సిబా జన్మదిన వేడుకలు శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హాజరై చిన్నారికి అక్షింతలు వేసి, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని, భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, మంచిగా చదువుకొని ,మంచి భవిష్యత్తు కావాలని ఆశీర్వదించినారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా 10,955 కేసుల పరిష్కారం

- సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.27.90 లక్షలకు పైగా రిఫండ్: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న 10,955 కేసులు పరిష్కరించామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన 10,955 కేసుల్లో 985 ఎఫ్ఐఆర్ కేసులు, 3301 ఈ–పెట్టీ కేసులు, 6621 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు, 48 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయని తెలిపారు.సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు మొత్తం రూ.27,90,612/–రిఫండ్ మొత్తాన్ని అందజేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.రాజీ మార్గం రాజ మార్గం అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదు లు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

## పరామర్శ.. నివాళి కార్యక్రమాల్లో పాల్గొన్న సండ్ర





**కల్లూరు, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపల్ పరిధిలోని పలు డివిజన్ లో పలు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. కల్లూరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైర్ల వెంకటేశ్వరరావు(B.V) ఇటీవల గుండెకు స్టంట్ వేపించుకోగా స్వగృహానికెళ్లి యోగక్షేమలు అడిగి పరామర్శించి తగిన ఆరోగ్య నియమాలను పాటించాలని సూచించారు, అనంతరం పుల్లయ్య బంజారా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దబోయిన నారాయణరావు సతీమణి దుర్గా వాణి దశదిన కర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండలం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, మాజీ జడ్పీటీసీలు కట్ట అజయ్ బాబు, లక్కినేని రఘు, మేకల కృష్ణ, కల్లూరు సొసైటీ అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, మండల యువజన అధ్యక్షుడు 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దేవరపల్లి భాస్కరరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, ఉబ్బన. వెంకటరత్నం, బత్తుల పల్లి మాజీ సర్పంచ్ లు, పుల్లారెడ్డి, రాములు, బీరవల్లి పురుషోత్తం, రాజ్ కుమార్, పోట్రూ. కిరణ్ బానోతు కృష్ణ, చారుగుండ్ల సందీప్, కళ్యాణ్ కిషోర్, ఖమ్మంపాటి రమేష్, ఇంతియాజ్, నరసింహారావు, రామవరపు ప్రసాద్, ఉబ్బన వేణుబాబు, సిహెచ్ కృష్ణ, రాఘవ రావు , కంచ పోగు సురేష్, కల్లూరు అంబేద్కర్ నగర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

- చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి
- పోరాట చరిత్రను అధికారికంగా నిర్వహించాలి
- పోరాట యోధుల కుటుంబాలకు గుర్తింపు కల్పించాలి
- సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



**బోనకల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గోవిందాపురం(ఎల్) లోని పోరాట యోధుల స్థూపాల వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్య స్థూపాలకు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాటి పోరాటంలో ఒకే చితిపై ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు అమరుల స్థూపానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి, ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ఫలితంగానే తెలంగాణ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి మార్గం సుగమమైందన్నారు.ఈ చారిత్రక పోరాటాన్ని హిందూ–ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. ఆనాటి పోరాటంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక హక్కులు, భూమి కోసం పోరాడారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి అధికారికంగా నిర్వహించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. పాలకులు మారుతున్నప్పటికీ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆనాటి పోరాట యోధుల కుటుంబాలకు సముచిత గుర్తింపు కల్పించాలని కోరారు.గోవిందాపురం(ఎల్) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చారిత్రక గ్రామమని హేమంతరావు పేర్కొన్నారు. మల్లెల వెంకటేశ్వరరావు నాయకత్వంలో తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్యతో పాటు అనేక మంది ఈ ప్రాంతంలో పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ఏడుగురిని ఒకే చితిపై దహనం చేసిన ఘటన ఈ ప్రాంత పోరాట చరిత్రలో విషాదకర ఘట్టమన్నారు.అమరుల స్ఫూర్తితో భవిష్యత్ ప్రజా ఉద్యమాలను నిర్మించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సీపీఎం గ్రామ కార్యదర్శి తమ్మారపు లక్ష్మణ్, గోవిందాపురం (ఎల్) సర్పంచ్ మంద కరుణ, ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, పుచ్చకాయల తిరవతయ్య, తమ్మారపు మల్లయ్య, తమ్మారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి

**కారేపల్లి, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి:** భారతదేశంలో నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా మార్క్సిజాన్ని అన్వయించి అనేక ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసిన నిజమైన పేదల పక్షపాది,విప్లవకారుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. సీతారాం ఏచూరి 2వ వర్ధంతి కార్యక్రమం కారేపల్లి, మాణిక్యారం గ్రామాలలో సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం మొదలుకొని సిపిఎం అఖిల భారత కార్యదర్శిగా ఎన్నిక అయ్యే అంతవరకు ఆయన సుదీర్ఘ ప్రస్థానం సాగిందని నిత్య అధ్యయనశీలి నిరంతరం పేదల కోసం ఈ దేశంలో కార్మిక వర్గ రాజ్యం కోసం కృషిచేల్పిన ఏచూరి జీవితం ధన్యమని పేర్కొన్నారు. నాటి విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాక ప్రస్తుత పరిస్థితుల్లో జెన్ జీ ఉద్యమాల విద్యార్థి యువత వరకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రాజ్యాంగాన్ని మార్చాలని మొత్తం స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలని నిర్వీర్యం చేస్తూ సమస్త వర్గాల ప్రజల చట్టాలను హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకే ప్రజా సంపదను అప్పనంగా దోచిపెడుతూ జీడీపి 7.8 అభివృద్ధి పేరుతో ప్రధాని ఉదరగొడుతు ప్రజలను నమ్మిస్తూ కార్పోరేట్లకు ప్రజా సంపదను అప్పనంగా దోచిపెడుతూ ఉన్న ప్రస్తుత మతోన్మాద నిరంకుశ పాసిస్టు లక్షణాలున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజా చైతన్యంతో ప్రజలను చైతన్య పరిచే ఉధృతమైన పోరాటాలు చేయడమే సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవ ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు, సీనియర్ నాయకులు మక్కా సీతారాములు, కరపడి సీతారామయ్య, కరపటి లక్ష్మయ్య, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆధర్ల వినయ్ కుమార్, పాయం వరలక్ష్మి , సిఐటియు నాయకులు ఆరెల్లి శ్రీరాములు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సంపత్, సైదులు, బాబు తదితరులు పాల్గొన్నారు



## కార్మికుల గోడు పట్టదా?

- 16 నుంచి నిరవధిక సమ్మె: ఏఐటీయూసీ




**కల్లూరు, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి** కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు మున్సిపాలిటీ కార్మికులు సంఘం ఏఐటీయూసీజిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం తెలిపి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్ వేతనాలు ఉన్న పాలకవర్గానికి మున్సిపాలిటీ అధికారులకు స్పందన లేదని కనుక 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు .16వ తేదీ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు వారి పేర్కొన్నారు .వేతనాలు లేక కుటుంబాలు అప్పుల పాలై జీవనం ఇబ్బందికరంగా మారిందని ప్రైవేటు వ్యక్తుల వద్దఅప్పులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నామని 9 నెలలైనా పాలకవర్గానికి ప్రభుత్వాధికారులకు స్పందన లేకుండా నిర్లక్ష్యంగా కార్మికుల పట్ల వ్యవహరిస్తున్నారని కార్మికుల కష్టాలు పట్టించుకోకుండా పట్టి పట్టనట్లు ఉన్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి లక్షన్నరపైగా రావాల్సి ఉండగా జీవనం ఇరుగుపొరుగు వారిపై ఆధారపడిందని మావేతన వెతలు మా గోడు ఎవరికి చెప్పుకోలేక పోతున్నారని ఆయన వివరించారు. నిర్లక్ష్యం ధోరణిలో ఉన్న పాలకవర్గం మున్సిపాలిటీ అధికారులు తోపాటు ప్రజాప్రతినిధులు పట్టించుకోని మా కుటుంబాలను ఆదుకోవాలని అంటూ వారికి మొరపెట్టుకుంటున్నారు. జీతమా జీవితమా ఇదేమి వేదన అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. మున్సిపాలిటీ ప్రజలు కార్మికులకు మద్దతునిచ్చి సంఘీభావంతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ మండలకన్వీనర్ కొత్తపల్లి వెంకటనారాయణ జిల్లా మున్సిపాలిటీ కార్మిక సంఘం కార్యదర్శి వజేర్మియా మున్సిపాలిటీ సోషల్ మీడియా అధ్యక్షులు మణి రాజు ,జరిపోతుల మంగమ్మ, ఖమ్మంపాటి రాణి ,ఉబ్బనమురళి నరసింహారావు సుధాకర్ జగదీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.